క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



అర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న మల్లయ్యగారిపల్లికి చెందిన సానే రమణారెడ్డిని బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి వరామర్శించారు. రూ. 50 వేలు ఆర్థికసాయం చేశారు. పట్టణాధ్యక్షుడు బాహద్దీన్, స్టేట్ లీగల్ సెల్ నాయకులు లింగాల లోకేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా

తలుపుల: అండర్-14 రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ఓబులరెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కే.భవానీ సత్తాచాటి బంగారు పతకం సాధించినట్లు బుధవారం హెచ్ఎం శ్రీవాత్సవరెడ్డి, పీఈటీ జయలక్ష్మి తెలిపారు. ఈనెల 4నుంచి 6 వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన పోటీల్లో విద్యార్థిని పాల్గొందన్నారు.

సాగు రైతులకు త్వరలో పట్టాలు

ఓడీ చెరువు: అసైన్డ్ భూముల సాగు రైతులకు త్వరలో ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయనున్నట్లు ఆర్డీఓ భాగ్యరేఖ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. రికార్డులు పక్కాగా సిద్ధం చేయాలన్నారు. అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ శ్రీధర్, రీసర్వే డీటీ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేద్దాం

నల్లమాడ: మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు భాగస్వాములై పేదలకు న్యాయం జరిగేలా చూడాలని ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, వైస్ ఎంపీపీ కే.సూర్యనారాయణ సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పక్కా గృహం నిర్మించుకునేలా చొరవ చూపాలని కోరారు. తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండ

తాడిమర్రి: కరోనాతో మృతి చెందిన కునుకుంట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త యల్లారెడ్డిగారి ఉపేంద్రరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అండగా నిలిచారు. మృతుని కుటుంబానికి రూ.50 వేలు అందించారు. బుధవారం మృతుని తల్లి రాజమ్మను ధర్మవరంలోని ఎమ్మెల్యే నివాసానికి పిలిపించుకుని నగదు అందించారు. అలాగే కునుకుంట్ల బీసీ కాలనీలో రామాలయ నిర్మాణానికి కాలనీవాసులకు రూ.50 వేలు అందించారు. అదే కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఆయన రూ.5 లక్షలను మంజూరు చేశారు. వడ్డి బ్రహ్మానందరెడ్డి, డీలర్ రామకృష్ణ, బండారు రాజా తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: బత్తలపల్లిలోని వడ్డెర కాలనీలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్డె క్రిష్టప్పను ఎమ్మెల్యే కేతిరెడ్డి పరామర్శించారు. బుధవారం గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు క్రిష్టప్ప అనారోగ్యంతో బాధపడుతున్నట్లు నాయకులు తెలిపారు. దీంతో ఆయన క్రిష్టప్ప ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు.

జేఈఈ మెయిన్‌లో ప్రతిభ

నల్లమాడ: జేఈఈ మెయిన్ పరీక్షా ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపారు. చెండ్రాయునిపల్లికి చెందిన తోలేటి భారతి, నారపరెడ్డిల కుమారుడు నితిన్ కుమార్ రెడ్డి 92.68 శాతం పర్సంటైల్‌తో సత్తా చాటాడు. అలాగే వేళ్లమద్ది గ్రామ పంచాయతీ వైఎస్సార్ సీపీ సర్పంచ్ బొజ్జేనాయక్ మనవడు, చెన్నమ్మబాయి, గిరిబాబునాయక్‌ల కుమారుడు డుంగావత్ రాహుల్‌నాయక్ 86.15 పర్సంటైల్ సాధించాడు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

తలుపుల: శింగనపల్లిలో బుధవారం తాగునీటి బోరు వద్ద నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. 15 రోజుల క్రితం ఎమ్మెల్యే సిద్దారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం చేపట్టగా, గ్రామస్తులు తాగునీటి బోరు మోటారు లోవోల్టేజీతో నడవడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. నెల రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యేకి సర్పంచ్ మల్లికార్జున, ఉపసర్పంచ్ లక్ష్మీదేవి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

గడప గడపలో ఆత్మీయ ఆదరణ



పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన వస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన బత్తలపల్లిలో బుధవారం ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ, సర్పంచు అక్కిం కాశమ్మ, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్‌తో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలోనే వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. బత్తలపల్లిలో మౌలిక వసతులతో పాటు మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. గ్రామంలో వీధుల్లో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ లైన్లు వేయించాలని పలువురు ఆయనను కోరారు. మరికొందరు తమకు పింఛన్లు అందలేదని తెలపడంతో వారి ముందే అధికారులతో అందుకు కారణాలను వివరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

పశు ఆరోగ్య అంబులెన్సు ప్రారంభం..

స్థానిక శివాలయం ముందు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య అంబులెన్సును జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీపీ గుర్రం వనజతో కలిసి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో 1962 నంబర్‌కు కాల్ చేసి ఉపయోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా ముదిగుబ్బ మండలానికి ఒక అంబులెన్సును కేటాయించాలని పశుసంవర్ధకశాఖ అధికారులకు సూచించారు.

- బత్తలపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-1ను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. అందులోని వివిధ ఛాంబర్‌లను తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీఓ సాయిమనోహర్, సర్పంచు అక్కిం కాశమ్మ, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, కార్యదర్శి ఉమాదేవి, ఇతర అధికారులతో ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, సాకే పార్వతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఉప సర్పంచు కోటి గోపీనాథ్, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, నాయకులు కరీంసాబ్, బాబాజాన్, షాషు, షాషావలి, జిక్రీయా, ప్రసాద్, తిరుపతయ్య, జాంపుల చంద్రమోహన్, సాకే గోపాల్, ఎరికల కాశప్ప, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శుభదాసు, ధర్మవరం డివిజన్ డీడీ డాక్టర్ చంద్రశేఖర్, బత్తలపల్లి డీడీ శ్రీనివాసరావు, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

ధర్మవరం: సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో బుధవారం సాయంత్రం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ మూడేళ్లలోనే నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి పథకం ప్రజల ఇంటికి చేరేలా వలంటీర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారన్నారు. పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

కలసికట్టుగా పోరాడదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- పచ్చమీడియా, విపక్షాల విమర్శలను తిప్పికొడదాం
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపు

అమడగూరు: దేశంలోనే ఎక్కడాలేని విధంగా పథకాలను అమలు చేస్తున్నా అధికారం దాహంతో ప్రతిపక్ష పార్టీ, పచ్చమీడియా ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను కలసికట్టుగా తిప్పికొడదామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక చౌడేశ్వరీ కల్యాణమండపంలో నిర్వహించిన గృహ సారథుల శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. చంద్రబాబు ఎల్లో మీడియాతో కలసి ప్రభుత్వంపై బురద జల్లాలని చూస్తున్నారని, ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్యను తీర్చాలనే దృఢ నిశ్చయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల మంది వలంటీర్లను నియమించారన్నారు. ముఖ్యమంత్రి రుణం తీర్చుకోవాల్సిన సమయం వస్తోందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబీకులకు సంక్షేమ పథకాల అమలు తీరును వివరించాలన్నారు. గత ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలతో రాష్ట్ర సంపదను, ప్రజాధనాన్ని అడ్డంగా దోచుకున్నారనే విషయాన్ని తెలియజేయాలన్నారు. పథకాలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ద్వారా అమలవుతున్నాయనే విషయాన్ని స్పష్టంగా తెలియబర్చాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇక నుంచి బ్యాడ్జీలను ధరించి జగనన్నకు మద్దతుగా నిలవాలన్నారు. అనంతరం జగనన్న సచివాలయ కిట్ పేరుతో ఓ బ్యాగును, అందులోని పలు వస్తువులను పరిచయం చేశారు. వచ్చే ఎన్నికల్లో మీ బిడ్డ దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని ఆదరించి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి తోడుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, శివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, రాష్ట్ర భట్రాజుల సంఘం డైరెక్టర్ మధుసూదన్‌రాజు, సొసైటీ అధ్యక్షులు బొట్టుస్వామి, సూర్యనారాయణరెడ్డి, సర్పంచులు సురేంద్రరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, షబ్బీర్, మోహన్‌రెడ్డి, ఆదినారాయణ, సరస్వతమ్మ, నరసమ్మ, లక్ష్మీనరసమ్మ, ఎంపీటీసీలు వెంకటలక్ష్మీ, పెద్దప్పయ్య, శకుంతలమ్మ, జయమ్మ, నాగరాజు, నక్కలచిన్నప్ప, రంగారెడ్డి, ఖాజాపీర్, సుధాకర్ రాజు, ఎస్‌ఐ వెంకటనారాయణ, తదితరులున్నారు.

మాన్యం అన్యాక్రాంతం కాకుండా చర్యలు

తాడిమర్రి: మండలంలో కునుకుంట్ల గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి గుడి మాన్యం భూమిని ఇరుగు, పొరుగు రైతుల ఆక్రమణలపై ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో దేవదాయశాఖ, రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని మన్యం భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టారు. నీలకంఠేశ్వరస్వామి గుడిలో దీప, ధూప, నైవేద్యాలను అందించడానికి నార్పల మండలం గంగనపల్లికి చెందిన బల్లా పెద్దరంగప్ప, బల్లా చిన్నరంగప్ప పూర్వీకులు వందేళ్ల క్రితం కునుకుంట్ల గ్రామంలోని సర్వేనంబర్ 457లో 8.49 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. ప్రస్తుతం అక్కడ ఎకరా సుమారు రూ.30 లక్షల వరకూ పలుకు తోంది. దీంతో మాన్యం విలువ రూ. 2.5 కోట్ల వరకు ఉంటుంది. కొన్నేళ్లుగా భూమికి చుట్టుపక్కల ఉన్న రైతులు కొంచెం, కొంచెంగా తమ పొలాల్లో కలుపుకునే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు విషయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దేవాదయశాఖ కమిషనర్ మల్లికార్జునరెడ్డికి సమస్యను వివరించారు. ఆయన ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఈఓ నాగేంద్రుడును గ్రామానికి పంపి మాన్యం ఆక్రమణకు గురి కాకుండా చూడాలని ఆదేశించారు. భూమిని విరాళంగా ఇచ్చిన దాతల వారసులను పిలిపించి రెవిన్యూ అధికారులకు వినతి పత్రం, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. అలాగే 1964లో గ్రామం గుండా తుంగభద్ర (హెచ్ఎల్‌సీ) కాల్వ శ్రీరాముని మాన్యంలో వెళ్లడంతో ప్రభుత్వం రూ.12,500ను గుడిపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసింది. ప్రస్తుతం ఆ మొత్తం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల మధ్య ఉంటుందని, దానిని కూడా బయటకు తీయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఆయన ఆలయంపై చేసిన డిపాజిట్ మొత్తం ఎంతైందో బయటకు తీయాలని ఎండోమెంట్ అధికారులను కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఐచర్ వాహనం గోతిలోకి దూసుకుపోయింది. తమిళనాడు నుంచి గుత్తికి టెంకాయలను తీసుకువెళుతున్న ఐచర్, బత్తలపల్లికి చేరుకోగానే డ్రైవర్ అనిల్ నిద్రమత్తులో తూలాడు. దీంతో ఐచర్ వాహనం వేగంగా అదుపుతప్పి డివైడర్లను ఢీ కొంది. గోతిలోకి దూసుకుపోయింది. ఆ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

సౌత్ ఉమెన్స్ జూడో చాంపియన్‌షిప్‌లో సత్తా

ధర్మవరం అర్బన్: ఖేలో ఇండియా సౌత్ ఉమెన్స్ జూడో చాంపియన్‌షిప్‌లో కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని రజత పతకం సాధించిందని హెచ్ఎం మేరి వరకుమారి, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు ఆదినారాయణ తెలిపారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థిని అభినందించారు. కేరళ రాష్ట్రం తిరువూరు వీఎన్‌కే ఇండోర్ స్టేడియంలో ఈనెల 3,4,5 తేదీల్లో పోటీలు జరిగాయన్నారు. ఈనెల 12 నుంచి 16 వరకూ భోపాల్‌లో జరగనున్న ఆల్ ఇండియా జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో సాయిప్రియ పాల్గొంటుందని, అక్కడ కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

భద్రతా నిబంధనలు పాటించాలి

ఓడీ చెరువు: వాహనం నడిపే సమయంలో రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని కదిరి ఎంవీఐ వరప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలు వాహనాలు నడపడం నేరమన్నారు. చాలా మంది పిల్లలు ద్విచక్రవాహనాలను నడుపుతూ చక్కర్లు కొట్టడం ఇటీవల వైరల్ అయిన విషయంపై కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. పిల్లలపై ప్రేమతో తల్లిదండ్రులు వాహనాలను ఇచ్చి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. అనంతరం బెస్ట్ యూనివర్సిటీ పరిధిలో జరిగిన క్రీడా పోటీల్లో విజయం సాధించి పతకాలు పొందిన విద్యార్థులకు ఎంవీఐ మెడల్స్, మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పిట్టా శివశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జయసింహారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలతో రైతులకు మెరుగైన సేవలు

బత్తలపల్లి: రైతులకు మెరుగైన సేవలందించేందుకే గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అటావుల రమణారెడ్డి అన్నారు. బుధవారం బత్తలపల్లిలోని ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఎంపీటీసీ సభ్యుడు కోటి నరేష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. సాగులో మెలకువలు తెలుసుకునేందుకు ఆర్‌బీకేల్లో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ప్రత్యేకంగా టోల్ ఫ్రీ 155251 నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. వ్యవసాయ విజ్ఞాన పుస్తకాలు అందుబాటులో ఉంచారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ క్రిష్టయ్య, ఏఓ ఓబిరెడ్డి, మండల ఇంజినీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమతం ఈశ్వరయ్య, నాయకులు బండి వీరనారప్ప, కరీంసాబ్, బాబ్‌జాన్, కుమ్మర వెంకటరమణ, ముసలయ్య, షాషావలి తదితరులున్నారు.

భక్తుల కొంగు బంగారం చెన్న కేశవుడు

పుట్టపర్తి: బుక్కపట్నం మండల పరిధిలోని చండ్రాయునిపల్లి సమీపంలో కొండలో వెలసిన పురాతన చెన్నకేశవ స్వామి భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్నాడు. స్వామికి ప్రతి సంవత్సరం మాఘమాసం సందర్భంగా తరుగువాండ్లపల్లికి చెందిన తరుగు వంశీయులు తడకోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా ఈ నెల 11 శనివారం స్వామి వారికి తడక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. రెండు సంవత్సరాలుగా ఎమ్మెల్యే దుద్దుకుంట తోడ్పాటుతో తరుగు వంశీయులు జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో రహదారి ఏర్పాటు చేయడంతో భక్తులకు ఇబ్బంది తొలగింది. ఉత్సవానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్నాటక నుంచి కూడా వేలాది మంది భక్తులు హాజరవుతారు. సమీపంలోని కొండ మరో భాగంలో దీపం గుండుకు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. ఇక్కడ దీపం వెలిగిస్తే సుదూరంలో ఉండే చెన్నకేశవ ఆలయంలో ఉన్నవారు దర్శనం చేసుకోవచ్చని చెబుతుంటారు. కాగా, భక్తుల నుంచి ఆదాయం వస్తున్నా దేవదాయ శాఖ అధికారులు కనీస అవసరాలు కల్పించటంలో విఫలం చెందారని భక్తులు, తరుగు వంశీయులు వాపోతున్నారు.

ఎస్‌డీజీ సర్వే పక్కాగా నిర్వహించాలి

తనకల్లు: ఎస్‌డీజీ (సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) సర్వేని పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ పూల నరసింహులు అన్నారు. మండల పరిధిలోని ఉస్తినిపల్లిలో జరుగుతున్న ఎస్‌డీజీ సర్వేని బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మనోహర్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

ప్రశాంతి నిలయం: హెచ్‌సీఎల్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో సంస్కృతీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరచి కొలువులు సాధించారు. కళాశాలకు చెందిన 11 మంది కొలువలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్ కుమార్ తెలిపారు. రూ.4.25 లక్షల వార్షిక వేతనం అందుతుందన్నారు.

చెరువు తూము గేట్లు ఎత్తడంపై వివాదం

ముదిగుబ్బ: ముక్తాపురం చెరువు తూము గేట్లు ఎత్తడానికి ప్రయత్నించిన జిల్లేడు బండ ప్రాజెక్ట్ అధికారులను బుధవారం ముక్తాపురం గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు అటు నుంచి వెళ్లిపోయారు.

విద్యార్థిని చితక బాదిన ఉపాధ్యాయుడు

ముదిగుబ్బ: నాగలగుబ్బ ప్రాథమిక పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న క్రిష్ణకాంత్ నాయుడును ఉపాధ్యాయుడు రఘునాథరెడ్డి చితకబాదాడు. ఓయంఆర్ సీట్ నింపడంలో తప్పు చేశాడని కోపంతో విద్యార్థిని బాదాడు. విద్యార్థి చెంపపై, చెవి భాగంలో దెబ్బలు తగిలాయని తల్లిదండ్రులు తెలిపారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఎంఈఓ సుధాకర్‌నాయక్ తెలిపారు.